
# పెన్ పవర్
## తెలంగాణ రౌండప్
సోమవారం 7 ఏప్రిల్ 2025 పేజీలు 8


బౌరంపేట్‌లో శ్రీ సీతారాముల కళ్యాణం..



- సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించిన మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి..
- బౌరంపేట్ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో రాములోరి కళ్యాణం..
- సీతారాముల కళ్యాణానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తిలకించారు..

# బౌరంపేట్‌లో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 6:** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని దుండిగల్ మున్సిపల్ పరిధి బౌరంపేట్‌లో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు.. మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి సీతారాముల కళ్యాణ మహోత్సవంలో పాల్గొని, స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ భౌరంపేట్ గ్రామంలో కొలువైన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామివారి(భౌరమ్మ గుడి) దేవాలయంలో శ్రీ సీతారాముల స్వామి వారి కళ్యాణ మహోత్సవం కనువిందు చేసింది.. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని తిలకించడానికి, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.. స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి గ్రామ ప్రజలు తండోపతండాలుగా హాజరయ్యారు. కళ్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం, అనంతరం తీర్థ ప్రసాదాలు అందచేశారు.. బౌరంపేట్‌లో భౌరమ్మ గుడివద్ద, పలు కాలనీలలో జరిగిన శ్రీ సీతా రామ కల్యాణ ఉత్సవాలకు భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీరాముని కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కాలనీల అధ్యక్షులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి..



రాములోరి కళ్యాణానికి అధికసంఖ్యలో పాల్గొన్న భక్తులు..



# శ్రీరామ్‌నగర్ కాలనీలో.. సీతారాముల కళ్యాణం..

ముఖ్య అతిధిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పార్థసారథి ప్రత్యేక పూజలు..

- సూరారం శ్రీరామ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అంగరంగవైభవంగా కళ్యాణం..
- టిడిపి నాయకుడు బర్ల శ్రీను, బీఆర్ఎస్ నేత మంత్రి సత్యనారాయణ పాల్గొన్నారు..
- కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు..
- మంగళ వాయిద్యాలతో, వేదపండితులు ఊరేగింపుగా ముత్యాల తలంబ్రాలు..



-3 లో

# మొక్కుబడి చర్యలు.. బరితెగించి పనులు..

రెవెన్యూ కూల్చివేసిన అక్రమ నిర్మాణంలో.. యధేచ్చగా పనులు చేపడుతున్న వైనం..

- దుండిగల్ బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఓ కాంగ్రెస్ నేత అనుచరుని అక్రమ నిర్మాణం..?
- సుమారు 18 ఏళ్ళ క్రితం ఇచ్చిన ఇందిరమ్మ పట్టాలతో పిల్లర్‌లతో అక్రమ నిర్మాణం..
- కాలంచెల్లిన పట్టాలతో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని మార్చి 24న రెవెన్యూ కూల్చివేత..
- వెంటనే నాలుగు రోజులుగా పనులు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

-2 లో



అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ..! ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లోనూ..! రెవెన్యూ అధికారుల విధులు సిఫార్సులకే పరిమితం ఇస్తూ..! నామమాత్రంగానే ఉంటున్నాయి.. చర్యలు తీసుకోవాలంటే సవాలక్ష అడ్డంకులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు "తిలాపాపం తలాపిడికెడు" అన్న చందంగా "ఆలీబాబా అరడజన్ కబ్జాదారుల ముఠాలు" ఏకమై దగ్గరుండి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.. ఈమధ్యన వీళ్ళలో పోటీ పెరిగిందనే ఆరోపణలు వస్తుండగా..! మరోవైపు ఓ కాంగ్రెస్ నేత అనుచరులు కూడా ఈ దందాలోకి దిగినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు.. గతంలో బీఆర్ఎస్ నాయకుల అనుచర ఘనం పెత్తనం చెలాయించగా..! ప్రస్తుతం ఆ పక్క ఊరుకు చెందిన కాంగ్రెస్ నాయకుని అనుచరుల పేరు వినిపిస్తుంది.. మరోవైపు రెవెన్యూ అధికారులు కూడా చర్యలు మొక్కుబడిగా ఉండటంతో..! అక్రమార్కులు వెంటనే పనులు ప్రారంభించినా చర్యలు చేపట్టడం లేదని విమర్శలు వస్తున్నాయి..

దుండిగల్, పెన్ పవర్, ఏప్రిల్ 6:

మార్చి 24న ఇలా కూల్చివేసిన రెవెన్యూ సిబ్బంది..



# మొక్కుబడి చర్యలు...

# బరితెగించి పనులు




- రెవెన్యూ కూల్చివేసిన అక్రమ నిర్మాణంలో.. యధేచ్ఛగా పనులు చేపడుతున్న వైనం..
- దుండిగల్ బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఓ కాంగ్రెస్ నేత అనుచరుని అక్రమ నిర్మాణం..?
- సుమారు 18 ఏళ్ళ క్రితం ఇచ్చిన ఇందిరమ్మ పట్టాలతో పిల్లర్‌లతో అక్రమ నిర్మాణం..
- కాలంచెల్లిన పట్టాలతో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని మార్చి 24న రెవెన్యూ కూల్చివేత..
- వెంటనే నాలుగు రోజులుగా పనులు చేస్తున్నా పట్టించుకోని రెవెన్యూ అధికారులు..

వెంటనే ఇలా అక్రమ నిర్మాణంలో పనులు..



దుండిగల్ మండలం బౌరంపేట ఇందిరమ్మ కాలనీ సర్వే నెంబర్ 576 ప్రభుత్వం భూమిలో సుమారు 18 ఏళ్ళ క్రితం దాదాపు 530 ఇందిరమ్మ పట్టాలను, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు, 60 గజాల చొప్పున, లేఅవుట్‌తో పంపిణీ చేసింది.. ప్రభుత్వ పట్టాలు "ఆరు నెలల నుండి ఏడాది" నిర్ణీత గడువు లోపు నిర్మించుకోవాలి, మరొకరికి విక్రయించినా..! సంబంధిత ప్రభుత్వ పట్టాలు చెల్లవు.. సదరు ఖాళీస్థలం కూడా ప్రభుత్వం ఆధీనంలోనే ఉంటుంది.. కాలం చెల్లిన పట్టాలతో బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో ఒకటొకటిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు.. మరోవైపు రెవెన్యూ అధికారులు కూడా పెద్దగా పట్టించుకోకపోవడం పిల్లర్‌లతో శాశ్వత నిర్మాణాలే నిర్మిస్తున్నారు..

## ఇలా రెవెన్యూ కూల్చివేతలు..! అలా అక్రమార్కుల పనులు..

బౌరంపేట ఇందిరమ్మ కాలనీలో సర్వే నెంబర్ 576 ఫస్ట్ లేఅవుట్‌లో ఓ వ్యక్తి పిల్లర్‌లతో అక్రమ నిర్మాణం చేపడుతుండగా.. స్థానికుల ఫిర్యాదు మేరకు, గత మార్చి 24న దుండిగల్ రెవెన్యూ అధికారులు మొక్కుబడిగా కూల్చివేశారు.. సదరు నిర్మాణదారునికి ఓ కాంగ్రెస్ నేత అనుచరుడికి బంధువు ఉండటంతో, రెవెన్యూ అధికారులకు సిఫార్సులు చేయించి..! మరుసటి రోజునుంచి దర్జాగా నిర్మాణ పనులు చేపడుతున్నట్లు ఆరోపిస్తున్నారు.. ఈ విషయంపై స్థానిక ఆర్ఐకి, రెవెన్యూ సిబ్బందితో సంబంధిత అక్రమ కట్టడంపై ప్రస్తావించినా చర్యలు లేకుండా సహకరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.. అధికార పార్టీ నేతల అక్రమ నిర్మాణాలకు చర్యల మినహాయింపు ఉందా అంటూ పలువురు విమర్శిస్తున్నారు..

# శ్రీరామ్‌నగర్ కాలనీలో.. సీతారాముల కళ్యాణం..

## ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పార్థసారథి ప్రత్యేక పూజలు..



సూరారం శ్రీరామ్‌నగర్‌లో సీతారాముల కళ్యాణం..



అన్న ప్రసాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పార్థసారథి..

- సూరారం శ్రీరామ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అంగరంగవైభవంగా కళ్యాణం..
- టిడిపి నాయకుడు బర్ల శ్రీను, బీఆర్ఎస్ నేత మంత్రి సత్యనారాయణ పాల్గొన్నారు..
- కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు..
- మంగళ వాయిద్యాలతో, వేదపండితులు ఊరేగింపుగా ముత్యాల తలంబ్రాలు..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, ఏప్రిల్ 6:** కుత్బుల్లాపూర్ సూరారం 129 డివిజన్ పరిధిలోని శ్రీరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ నవమి వేడుకలు అంగరంగవైభవంగా నిర్వహించారు.. సీతారాముల కళ్యాణానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై సీతారాముల వారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.. సూరారం శ్రీరామ్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్లో జరిగిన శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కల్యాణ మహోత్సవానికి కాలనీ వాసులంతా పాల్గొన్నారు.. కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చి స్వామి వారికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు, అర్చకులు, పూజారుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కల్యాణం జరిపించగా భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సీతారాముల కళ్యాణం తిలకించారు. స్వామివారి కళ్యాణోత్సావంలో భక్తులందరూ పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.. అనంతరం పెద్ద ఎత్తున్న అన్నదానం కార్యక్రమంలో ప్రసాదం స్వీకరించి సీతారాముల ఆశీర్వాదం పొందారు

## హైదరాబాద్ లో శోభాయాత్ర.. జైశ్రీరాం నినాదాలతో మారుమోగుతున్న సీతారాంభాగ్



**హైదరాబాద్ పెన్ పవర్:**శ్రీరామనవమి వాడ వాడలా ఘనంగా జరిగాయి. హైదరాబాద్‌లో శోభాయాత్ర ప్రారంభమైంది. మంగళ్‌హాట్ పరిధి సీతారాంభాగ్ నుంచి ప్రారంభమైన ఈ యాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా 20 వేల మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. సీతారాంభాగ్ దగ్గర జై శ్రీరాం నామ స్మరణ మారుమోగుతుంది. శోభాయాత్ర మార్గమంతా అడుగడుగున సీసీ కెమెరాల నిఘా కొనసాగనుంది. శోభాయాత్ర పర్యవేక్షణ కోసం జాయింట్ కంట్రోల్ రూమ్‌తో పాటు బంజారాహిల్స్ లోని మెయిన్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. భద్రతలో భాగంగా రాపిడ్ యాక్షన్ ఫోర్స్, సిటీ ఆర్ రిజర్వ్, క్విక్ రియాక్షన్ టీం, సిటీ టాస్క్ ఫోర్స్, షీ టీమ్స్, మఫ్టీ క్రైమ్ పార్టీ పోలీసులు శోభాయాత్రను మానిటర్ చేయనున్నారు. భక్తులు శాంతియుతంగా, భక్తిభావంతో శోభాయాత్రలో పాల్గొనాలని అధికారులు కోరుతున్నారు.

## భద్రాచలంలో ఘనంగా రాములోరి కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్ పెన్ పవర్:**భద్రాచంలోని శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్నంలో రాములోరు సీతమ్మవారి మెడలో మాంగళ్య ధారణ చేశారు. మిథిలా మైదానంలో ఈ కల్యాణ కార్యక్రమాన్ని ఆలయ పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సీతారాముల కల్యాణ మహోత్సవానికి తెలుగులు రాష్ట్రాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వామి, అమ్మ వారి కల్యాణాన్ని చూసి ఆనందపడిపోయారు. భక్తుల రామ నామస్మరణతో భద్రాచలం వీధులన్నీ మార్మోగాయి. తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఆయన సతీమణి గీతతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు.

## శ్రీరామ నవమి రోజున విషాదం.. గాలి దుమారం.. టెంట్లు కుప్పకూలి.. తలలు పగిలి తీవ్ర గాయాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీరామ నవమి రోజున విషాదం జరిగింది. జనగామ జిల్లా పాలకుర్తి మండలం రామాలయం దగ్గర గాలి దుమారం బీభత్సం రేపింది. ఆలయం దగ్గర వేసిన టెంట్లు కుప్పకూలాయి. భక్తులకు ఏర్పాటు చేసిన భోజన టెంట్లు కూలి భక్తులకు గాయాలయ్యాయి. ముగ్గురు భక్తులకు తలలు పగిలి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఒక్కసారిగా భక్తులపై టెంట్లు కూలడంతో భక్తులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. శ్రీరామ నవమి సందర్భంగా భక్తులకు భోజనాలు ఏర్పాటు చేశారు. భక్తులకు ఏర్పాటు చేసిన ఈ భోజనాలన్నీ నేల పాలయ్యాయి. ఇదిలా ఉండగా.. నిజామాబాద్ జిల్లాలో శ్రీరామ నవమి పండగ రోజున కుల వివక్ష ఘటన వెలుగుచూసింది. ఏర్గట్ల మండలం తాల్లరాంపూర్?లో శ్రీరామ నవమి కుంకుమర్చాన పూజలకు మహిళలను గుడిలోకి పూజారి అనుమతించలేదు. గౌడ కుల మహిళలను రామాలయంలోకి రావద్దని గ్రామాభివృద్ధి కమిటీ చెప్పిందని పూజారి చెప్పాడు. చేసేదేమి లేక గుడి నుంచి గౌడ మహిళలు బయటకు వచ్చారు. పోలీస్ స్టేషన్?లో గౌడ కులస్తులు, మహిళలు ఫిర్యాదు చేశారు.

## బలం లేకనే పోటీ చేస్తలేం.. కిషన్ రెడ్డి బీఆర్ఎస్ బినామీ: పొన్నం ప్రభాకర్





**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మె ల్సీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి బలం లేకపోవడం వల్లే పోటీలో నిలవలేదని, ఎన్నికల్లో తాము ఏ పార్టీకీ సపోర్ట్ చేయమని పొన్నం అన్నారు. బలం లేని చోట బీజేపీ ఎలా గెలుస్తుంది? అంటూ హైదరాబాద్ లోకల్ బాడీ ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ అభ్య ర్థిని పెట్టకుండా బీజేపీకి లోపాయికారి ఒప్పం దంతో మద్దతు తెలిపిందన్నారు. 23 ఓట్లున్న బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో బీజేపీకి ఇంటర్నల్ మద్దతు ఇస్తుందన్నారు. ' కాంగ్రెస్ పోటీలో లేదు. మేము బీజేపీకి మద్దతు ఇచ్చే పరిస్థితి ఉండదు. బలం లేని చోట బీజేపీ ఎలా గెలుస్తుంది? బీజేపీ, బీఆర్ఎస్ ఒప్పందంలో భాగంగానే బీజేపీ నామినేషన్ వేసింది. 112 ఓట్లలో బీజేపీకి కేవలం 27 ఓట్లు మాత్రమే ఉన్నాయి. బీజేపీ ఎలా గెలుస్తుంది క్రాస్ ఓటింగ్ ఎంకరేజ్ చేస్తున్నారా? కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీఆర్ఎస్ నాయకునికి బినామీగా వ్యవహరిస్తున్నారు. ' అని మంత్రి పొన్నం అన్నారు.

# శ్రీలీల చేయి పట్టుకుని గుంపులోకి లాగిన పోకిరీలు..


- డార్జిలింగ్‌లో శ్రీలీలకు చేదు అనుభవం
- ఆకతాయిల చర్యతో షాక్ తిన్న నటి
- సిబ్బంది సహాయంతో సురక్షితంగా బయటపడిన వైనం





**హైదరాబాద్ పెన్ పవర్:** సెలబ్రిటీలు సైతం కొన్ని సార్లు అభిమానుల అత్యుత్సాహానికి గురవుతున్న సంఘటనలు జరుగుతున్నాయి. తాజాగా, యువ హీరోయిన్ శ్రీలీలకు డార్జిలింగ్‌లో చేదు అనుభవం ఎదురైంది. షూటింగ్ ముగించుకుని తిరిగి వస్తుండగా కొందరు అభిమానులు ఆమెతో అనుచితంగా ప్రవర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాలీవుడ్ ఎంట్రీ కోసం ఎదురుచూస్తున్న శ్రీలీల, కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో ఒక ప్రేమ కథా చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ నిమిత్తం చిత్ర యూనిట్ డార్జిలింగ్‌కు వెళ్ళింది. షూటింగ్ అనంతరం కార్తీక్ ఆర్యన్‌తో కలిసి శ్రీలీల తిరిగి వస్తుండగా అభిమానులు వారిని చుట్టుముట్టారు. కార్తీక్ ఆర్యన్ అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు వెళ్లగా, శ్రీలీల కూడా నవ్వుతూ ఆయనను అనుసరించారు. అయితే, గుంపులో ఉన్న కొందరు వ్యక్తులు శ్రీలీల చేయి పట్టుకుని లాగడంతో ఆమె ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది ఆమెను వారి నుంచి విడిపించి సురక్షితంగా అక్కడి నుంచి తీసుకువెళ్లారు.
ఈ సంఘటనకు సంబంధించిన వీడియో వైరల్ కావడంతో నెటిజన్లు శ్రీలీల పట్ల జరిగిన ఈ ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నారు. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత స్వేచ్ఛ ఉంటుందని, అభిమానులు హద్దులు మీరకుండా ప్రవర్తించాలని సూచిస్తున్నారు. అలాంటి ఆకతాయిలను దూరంగా ఉంచాలని స్పష్టం చేస్తున్నారు.

# భద్రాచలం.. 9 ఏళ్ల తర్వాత రేవంత్ వల్ల మొదలైన సంప్రదాయం





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. భక్తులు శ్రీరాముని జన్మదినాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటున్నారు. ఈ శుభ సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 9 ఏళ్ల తర్వాత ఒక సంప్రదాయానికి మళ్లీ ప్రాణం పోశారు. తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో రామ నవమి సందర్భంగా ముఖ్యమంత్రి తరఫున పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించడం ఒక ఆనవాయితీ. అయితే 2015లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సంప్రదాయాన్ని ప్రారంభించారు. ఆ ఏడాది ఆయన స్వయంగా భద్రాచలం వెళ్లి రాములోరికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. కానీ ఆ తర్వాత ఈ సంప్రదాయం నిలిచిపోయింది.
మళ్లీ తొమ్మిదేళ్ల తర్వాత నేడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు. ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి భద్రాచలం చేరుకుని శ్రీరామునికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు.
తెలంగాణలో చారిత్రాత్మక ప్రాధాన్యత కలిగిన భద్రాచలం రామాలయానికి రేవంత్ రెడ్డి సానుకూల దృక్పథంతో మళ్లీ ఈ సంప్రదాయాన్ని ప్రారంభించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోంది. భక్తులు, ప్రజలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. భద్రాచలంలో శ్రీరామ నవమి వేడుకలు ఎంతో వైభవంగా జరుగుతుండగా, ముఖ్యమంత్రి స్వయంగా వచ్చి రాములోరికి కానుకలు సమర్పించడం ఈ వేడుకలకు మరింత శోభను చేకూర్చింది. ఈ చర్య భక్తుల్లో మరింత భక్తి భావాన్ని నింపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# ట్రంప్ టారిఫ్ లను ఎద్దేవా చేస్తూ చైనా ఏఐ వీడియో!



**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంకాలను చైనాకు చెందిన ఓ వార్తా సంస్థ వ్యంగ్యంగా విమర్శించింది. చిన్న దేశం, పెద్ద దేశం, మిత్ర దేశం, శత్రు దేశం అనే తేడా లేకుండా ట్రంప్ సుంకాలను పెంచడంపై చైనా గ్లోబల్ టెలివిజన్ నెట్‌వర్క్ రెండు నిమిషాల 45 సెకన్ల నిడివి గల ఓ వీడియోను రూపొందించింది.

ట్రంప్ ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'విమోచన దినం' అంటే చాలా మంది అమెరికన్ల జీతాలు తగ్గించడమేనని, వారి ఖర్చులు పెంచడమేనని ఆ వీడియో ఎద్దేవా చేసింది. ట్రంప్ చర్యల వల్ల తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని పేర్కొంది. ఇప్పటికే స్టాక్ మార్కెట్లు నష్టపోయాయని గుర్తు చేసింది. సుంకల కారణంగా అమెరికన్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ వీడియోలో చూపించారు. టారిఫ్‌ల ప్రకటన రోజును 'విమోచన దినం'గా అభివర్ణించడంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. నిత్యావసర వస్తువులు, ఆహార పదార్థాల ధరలు పెరిగిపోవడంతో పాటు వాహనాల తయారీపై సుంకల ప్రభావాన్ని కూడా ప్రస్తావించారు.

ఇదిలా ఉండగా మరో మీడియా సంస్థ కూడా ఇదే తరహాలో ఒక వీడియోను విడుదల చేసింది. అందులో ఒక కృత్రిమ మేధస్సు (%ూ×%) రోబోను 'టారిఫ్'గా చూపించారు. వాణిజ్య యుద్ధం, అశాంతికి దారి తీసే అధిక సుంకాలను భరించలేక ఆ రోబో తాను నిర్వీర్యం చేసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆ వీడియోలో ఉంది. భారత్‌తో సహా పలు దేశాలపై ట్రంప్ పరస్పర సుంకాలు విధించారు. దీని కారణంగా అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరుగుతాయని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్న అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది మరింత నష్టం కలిగిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కూడా దారితీయవచ్చని నిపుణులు అనుమానిస్తున్నారు.

# అమెరికాలో తెలుగు విద్యార్థులకు తృటిలో తప్పిన ప్రమాదం

- బర్మింగ్‌హామ్‌లో అగ్నిప్రమాదం
- సురక్షితంగా బయటపడ్డ 10 మంది తెలుగు విద్యార్థులు
- ఇద్దరు విద్యార్థులకు గాయాలు, ఐసీయూలో చికిత్స
- అపార్ట్‌మెంట్లు పూర్తిగా దగ్ధం.




**హైదరాబాద్ పెన్ పవర్:**అమెరికాలోని బర్మింగ్‌హామ్ నగరంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. కెల్లామ్ స్ట్రీట్‌లోని అపార్ట్‌మెంట్‌లో సంభవించిన ఈ ప్రమాదం నుంచి పది మంది తెలుగు విద్యార్థులు తృటిలో ప్రాణాలతో బయటపడ్డారు. శనివారం సాయంత్రం 6:20 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదం స్థానికంగా కలకలం రేపింది.

అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దట్టమైన పొగలు వ్యాపించాయి. దీంతో ఊపిరాడక విద్యార్థులు భయంతో కేకలు వేశారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. మంటలను అదుపులోకి తీసుకువచ్చి, అపార్ట్‌మెంట్‌లో చిక్కుకున్న విద్యార్థులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించి ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. మిగిలిన విద్యార్థులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వారందరూ ప్రస్తుతం సురక్షితంగా ఉన్నారు. బాధితులంతా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు. వీరంతా అలబామా విశ్వవిద్యాలయంలో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించామని, కానీ మంటలు క్షణాల్లో వ్యాపించడంతో భయంతో బయటకు పరుగులు తీశామని విద్యార్థులు తెలిపారు. వెనుక ద్వారం ద్వారా బయటకు రావడంతో ప్రాణాలతో బయటపడ్డామని, ఇది తమకు పునర్జన్మ అని వారు పేర్కొన్నారు. అగ్నిప్రమాదం కారణంగా అపార్ట్‌మెంట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. విద్యార్థులు నిలువ నీడలేకుండా నిరాశ్రయులయ్యారు. స్థానిక తెలుగు సంఘాలు, విశ్వవిద్యాలయ అధికారులు విద్యార్థులకు సహాయం అందించేందుకు ముందుకు వచ్చారు. వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.


# పాలనపై పట్టులేని రేవంత్ రబ్బర్ స్టాంప్ సీఎం: బండి సంజయ్



**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి రబ్బర్ స్టాంప్ లా మారారని కేంద్ర మంత్రి బండి సంజయ్ సెటైర్ వేశారు. ముఖ్యమంత్రికి పాలన మీద పట్టులేకుండా పోయిందని.. రాష్ట్ర మంత్రులను ఏఐసీసీ నిర్ణయించడం ఏంటి? అని ప్రశ్నించారు. బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పు రస్కరించుకుని కరీంనగర్ లో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రివర్గంలో ఎవరుండాలనేది కాంగ్రెస్ హైకమాండ్ నిర్ణయిస్తుందనడం విడ్డూరం.

రాష్ట్రాన్ని దోచుకుని ఢిల్లీ పెద్దలకు కప్పం కడు తున్నారు. హెచ్ సీయూ భూముల వ్యవహారమే ఇందుకు కారణం. కాంగ్రెస్ అవినీతి పాలనను అంతం చే యాల్సిన సమయం ఆసన్నమైంది. హైదరాబాద్ ను మజ్లిస్ కు అప్పగించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటీపడుతున్నాయి. సన్న బియ్యం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం భరించేది రూ. 10లే. ఆ విషయాన్ని తెలుసుకుని మంత్రులు, కాంగ్రెస్ నేతలు మాట్లాడితే మంచిది' అని బండి సంజయ్ సూచించారు.

# రెగ్యులర్ గా ట్యాబ్లెట్లు వాడేవారి కోసం.. పిల్ ఆర్గనైజర్




**హైదరాబాద్ పెన్ పవర్:**దీర్ఘకాలిక రోగాలు ఉన్నవాళ్లలో చాలామంది ప్రతిరోజూ ట్యాబ్లెట్ వేసుకోవాల్సి ఉంటుంది. అలాంటివాళ్లలో కొందరు ట్యాబ్లెట్ వేసుకోవడం మర్చిపోవడం లేదంటే వేసుకున్న విషయం మర్చిపోయి రెండోసారి వేసుకోవడం లాంటివి చేస్తుంటారు. దానివల్ల రకరకాల సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటివాళ్లకు బెస్ట్ సొల్యూషన్ ఈ పిల్ ఆర్గనైజర్. దీన్ని పాప్ క్యూబ్ అనే కంపెనీ తీసుకొచ్చింది. ఇందులో ఏడు రోజులకు గాను ఏడు పెద్ద కంపార్ట్‌మెంట్స్ ఉంటాయి. ప్రతి కంపార్ట్‌మెంట్‌లో నాలుగు స్లాట్స్ ఉంటాయి. అంటే ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి.. ఇలా ఒక్కో పూట వేసుకోవాల్సిన టాబ్లెట్స్‌ని ఒక్కో స్లాట్‌లో పెట్టుకోవచ్చు. ప్రతి స్లాట్‌లో 6 ఫిష్ ఆయిల్ క్యాప్స్యూల్స్, 15 సాధారణ టాబ్లెట్స్ లేదంటే 11 క్యాప్సూల్స్‌ను వేసుకోవచ్చు. ఈ బాక్స్‌ని ఏబీఎస్ ప్లాస్టిక్ తయారుచేశారు. ఇది కింద పడినా లోపల ఉన్న ట్యాబ్లెట్స్ విరిగిపోవు. వారం రోజులకు సరిపడా ట్యాబ్లెట్స్‌ని ఈ బాక్స్‌లో వేసి పెట్టుకోవచ్చు. ట్యాబ్లెట్స్ వేసుకున్న విషయం మర్చిపోయినా.. బాక్స్ ఓపెన్ చేసి చూస్తే తెలిసిపోతుంది. ? ధర: రూ. 795

# సరకు రవాణాలో గుంటూరు రైల్వే డివిజన్ సరికొత్త రికార్డులు

**హైదరాబాద్ పెన్ పవర్:** సరకు రవాణా వ్యవస్థలో రైల్వేల పాత్ర అత్యంత కీలకం. వాటికి అత్యధిక ఆదాయం వచ్చేది కూడా ఈ మార్గం ద్వారానే. అందుకే గుంటూరు రైల్వే డివిజన్ వీటిపై ప్రత్యేక దృష్టి సారించింది. గతిశక్తి టెర్మినళ్ల ద్వారా అధిక మొత్తంలో సరకు రవాణా చేస్తోంది. 2023-2024లో 3.364 మిలియన్ టన్నుల సరకులు రవాణా చేసి గత రికార్డులను అధిగమించింది. ఈ ఏడాది 2024-2025లో 3.451 మిలియన్ టన్నులు లోడ్ చేసి ఆ రికార్డునూ దాటేసింది. 2003 ఏప్రిల్ 1న గుంటూరు రైల్వే డివిజన్ ప్రారంభమైనప్పటి నుంచి ఉన్న రికార్డులన్నింటిని తిరగరాస్తూ దక్షిణ మధ్య రైల్వేలోనే ప్రత్యేకత చాటుకుంటుంది.

మరి రికార్డు స్థాయిలో సరకు రవాణా ఎలా సాధ్యమవుతోంది? తయారీదారులు, వ్యాపారవేత్తలు సరకులను రైల్వే ద్వారా రవాణా చేసేందుకు ఆసక్తి చూపించడం కోసం అధికారులు చేపట్టిన వినూత్న చర్యలేంటో గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ మాటల్లోనే విందాం. మరోవైపు గుంటూరు డివిజన్లలో కొత్తగా మూడు గతిశక్తి కార్గో టర్మినల్స్ నిర్మించడంతో అదనంగా లోడింగ్ చేయగలుగుతున్నారు. అతి తక్కువ సమయానికి సురక్షితంగా సరకు చేరవేస్తుండటంతో వ్యాపారవేత్తలకు బాగా నమ్మకం కుదిరింది.



"3.451 మిలియన్ టన్నులు లోడింగ్ చేశాం. 2023-2024లో 3.364 మిలియన్ టన్నులు లోడింగ్ చేశాం. సిమెంట్, క్లింకర్, కంటైనర్ లోడింగ్ ఎక్కువ కావడం వల్లే ఇదంతా జరిగింది. ఇందుకు మాకు చాలా సంతోషంగా సంతోషంగా ఉంది. తక్కువ సమయంలోనే సురక్షితంగా సరకు రవాణా చేస్తున్నాం." - రామకృష్ణ, డీఆర్ఎం

వ్యవసాయ, పారిశ్రామిక ఉత్పత్తుల రవాణాకు అనుకూలంగా ఉండటం రోడ్డు మార్గం కంటే తక్కువ ధరకే సరకు రవాణా చేయడం మరో ప్లస్ పాయింట్. రైల్వే ఉన్నతాధికారుల సూచనల మేరకు వినూత్న ఆలోచనలతో, ఎప్పటికప్పుడు సత్వర నిర్ణయాలు తీసుకుంటామని రైల్వే అధికారులు అభిప్రాయపడుతున్నారు. అందుకే దీనికి ఆదరణ బాగా పెరిగిందని వివరిస్తున్నారు. అధికారులు, సిబ్బంది, కార్మికులతో సమన్వయం చేసుకుని నిర్ణీత ప్రతిపాదనలతో పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగడంతో రికార్డు స్థాయిలో సరుకు రవాణా సాధ్యమైందని చెబుతున్నారు.

అయితే రైల్వే అధికారులు లారీల నుంచి గూడ్స్ బండ్లలోకి సరుకు లోడ్ చేసే కూలీలకు అవసరమైన కనీస సౌకర్యాలు, వసతుల మీద దృష్టి సారిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని కూలీలు అంటున్నారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతూనే లోడింగ్ చేస్తున్నట్లు వాపోతున్నారు. కనీసం నిల్చొనేందుకు కూడా నీడ లేక పోవడంతో ఖాళీ సమయాల్లో గూడ్స్ పట్టాలపైనే కూలీలు సేద తీరుతున్నట్లు చెబుతున్నారు.

అటు వ్యాపారులు సైతం లోడింగ్?కు 8 గంటలే కాకుండా మరికొంత సమయం ఇవ్వాలని కోరుతున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య కారణంగా లారీలు ఆలస్యంగా రావడంతో అదనంగా ఛార్జీలు చెల్లించాల్సి వస్తోందని అంటున్నారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారిస్తే సరకు రవాణాకు మరికొంతమంది ముందుకు వస్తారని వ్యాపారులు చెబుతున్నారు.

# ఉద్యోగులకు గొలుసులు కట్టి కుక్కల్లా నడిపించిన ప్రైవేటు కంపెనీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఉదంతం గురించి తెలిస్తే.. మనం రాతి యుగంలో ఉన్నామా? అన్న భావన కలిగేలా చేస్తుంది. కేరళలో చోటు చేసుకున్న ఈ అమానవీయ ఘటన షాకింగ్ గా మారింది. ఎంత ప్రైవేటు సంస్థ అయితే మాత్రం సరిగా పని చేయని ఉద్యోగులను ఇంత దారుణ శిక్ష విధిస్తారా? అన్నదిప్పుడు ప్రశ్నగా మారింది. పని తీరు సరిగా లేదన్న ఆరోపణలతో కుక్కల మాదిరి ఉద్యోగులకు గొలుసులు కట్టి.. కుక్కల మాదిరి నడిపించటమే కాదు. చిల్లర నాణెలు విసిరి.. వాటిని నోటితో తీయించిన దుర్మార్గం వెలుగు చూసింది.దీనికి సంబంధించిన వీడియోలు టీవీ ఛానళ్లలో టెలికాస్టు కావటంతో ఈ అంశం పెను సంచలనంగా మారింది. ఈ వీడియోలపై కేరళ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. వెంటనే స్పందించిన కార్మిక శాఖ ఆదేశాలతో పోలీసులు రంగంలోకి దిగారు. సదరు కంపెనీ మీద తక్షణమే విచారణ జరిపి.. నివేదిక ఇవ్వాలని చెప్పారు. దీంతో.. పోలీసులు ఈ కంపెనీమీద విచారణ షురూ చేశారు.ఉద్యోగుల్ని తీవ్ర వేధింపులకు గురి చేసిన ఈ కంపెనీకి చెందిన ఉద్యోగి ఒకరు మీడియా ఎదుట వచ్చారు. సదరు ఉద్యోగి సైతం దారుణ శిక్షకు గురైన వీడియోలో ఉన్న వారే కావటం గమనార్హం. తమ కంపెనీలో వేధింపులు లేవని.. టీవీలో టెలికాస్ట్ అయిన వీడియో కొన్ని నెలల క్రితం నాటిదని పేర్కొన్నారు. అప్పట్లో మేనేజర్ గా ఉన్న వ్యక్తి తమ చేత బలవంతంగా అలా చేసి షూట్ చేశారన్నారు.



ఈ విషయం యాజమాన్యం వరకు వెళ్లటంతో అతడ్ని తొలగించారని.. ఆ కోపంతో ఇప్పుడు అతడు ఈ వీడియోల్ని బయటపెట్టి.. కంపెనీని ఇబ్బందికి గురి చేస్తున్నట్లు తెలిపాడు. కార్మిక శాఖ అధికారుల ముందు కూడా సదరు ఉద్యోగి ఇదే వాంగ్మూలాన్ని ఇవ్వటం గమనార్హం.

మరోవైపు.. ఈ సంస్థకు చెందిన మరికొందరు ఉద్యోగులు మాత్రం.. మార్కెటింగ్ ఉద్యోగులు తమ పని తీరు సరిగా చూపని కారణంగా ఈ తరహా శిక్షలు విధించిన మాట వాస్తవమేనని పేర్కొన్నారు. టార్గెట్లు సాధించక ఫెయిల్ అయిన వారికి ఇలాంటి శిక్షలు విధించినట్లుగా పేర్కొన్నారు. అయితే.. సంస్థ యాజమాన్యం మాత్రం ఈ ఆరోపణల్ని ఖండిస్తోంది. ఈ ఉదంతంపై హైకోర్టు న్యాయవాది ఒకరు రాష్ట్ర మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేయగా.. ఈ అంశంపై కేసు నమోదు చేసింది. మొత్తంగా ఈ వ్యవహారం కేరళలో ఇప్పుడు సంచలనంగా మారింది.

# పట్టించుకోవట్లేదట.. తప్పుకుంటారా? తప్పిస్తారా?



**హైదరాబాద్ పెన్ పవర్:** కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక పలువురు ఎమ్మెల్యేలు బహిరంగంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. అలాంటి వాళ్లలో ఎమ్మెల్యే కొలికపూడి కూడా ఒకరు. పలు సందర్భాల్లో ఆయన చేసిన వ్యాఖ్యలకు టీడీపీ అధిష్ఠానం ఆగ్రహం వ్యక్తం చేసింది. పార్టీ కార్యక్రమాలకు కూడా ఆయనను పిలవడం దాదాపుగా మానేశారు. కూటమి నాయకులతో కనీసం మంచి ర్యాపో కూడా ఆయన మెయిన్టైన్ చేయలేకపోయారనే విమర్శలు ఉన్నాయి. తిరువూరులో ఎమ్మెల్యేకు, సొంత పార్టీ నేతలకు కొద్దికాలంగా వివాదం నడుస్తోంది. అది రచ్చకెక్కింది కూడా!! అదే విషయాన్ని సీఎం చంద్రబాబుకు కూడా తెలియజేశారు. తాజాగా ఎన్టీఆర్ జిల్లా నందిగామ పర్యటనకు వచ్చిన సీఎం కొలికపూడిని కనీసం పట్టించుకోలేదు.

నందిగామ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు స్వాగతం పలికేందుకు మంత్రులు, ఎమ్మెల్యేలు హెలిప్యాడ్ వద్దకు వచ్చారు. సీఎం తన వద్దకు రాగానే తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి ఆయనకు నమస్కరించారు. చంద్రబాబు ఒక్క క్షణం ఆయన్ను చూశారు కానీ పలకరించలేదు. ఆ తర్వాత మిగిలిన నాయకులు, మహిళలు చంద్రబాబుతో మాట్లాడారు. కొలికపూడి కూడా ముందుకు వెళ్లి కలవాలని అనుకోలేదు.

# పవన్ గోల్ అదే.. రీచ్ కావడానికి మాత్రం కొంత సమయం?




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు బాటలు మెరుగుపర్చుకుంటున్నారు. అన్ని సామాజికవర్గాలను కలుపుకుని వెళుతూ తన లక్ష్యాన్ని ఆయన నిర్దేశించుకున్నట్లే కనపడుతుంది. తనకు ఇంతటి విజయాన్ని అందించిన కాపు సామాజికవర్గంతో పాటు అభిమానుల ఆశలు నీరుగార్చకుండా కొంత ఆలస్యమయినా అనుకున్న టార్గెట్ ను రీచ్ అవ్వడానికి ఒక మార్గాన్ని రూపొందించుకుంటున్నారన్న విశ్లేషణలు వినపడుతున్నాయి. ఇటు కాపు సామాజికవర్గం, అటు కమ్మ సామాజికవర్గంతో పాటు బీసీ ఓటర్లతో పాటు అన్ని వర్గాలను తనకు అనుకూలంగా మలచుకునే ప్రయత్నాలు పవన్ కల్యాణ్ చేస్తున్నట్లే కనిపిస్తుంది.

**కేంద్ర సహకారంతో...**

ఒకవైపు కేంద్ర ప్రభుత్వం నుంచి ఫుల్లు సపోర్టు పవన్ కల్యాణ్ కు ఉంది. మోదీ నుంచి కింది స్థాయి నేతల వరకూ పవన్ కల్యాణ్ ను అభిమానిస్తున్నారు. పవన్ కల్యాణ్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తక్కవ సార్లు ఢిల్లీకి వెళుతూ వారితో సత్సంబంధాలను ఎప్పటికప్పుడు మెరుగుపర్చుకుంటూ ఫ్యూచర్ లో తనకు అండగా నిలబడేందుకు అన్ని రకాలుగా ఒక్కొక్క మెట్టును పేర్చుకుపోతున్నారు. బీజేపీ కూడా పవన్ కల్యాణ్ ను ముఖ్యమంత్రిగా చూడాలని గట్టిగా అనుకుంటుందన్న వార్తలు వస్తున్నాయి. అయితే చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాదు. ఇప్పుడు కాకుండా అవసరమైన సమయంలో పవన్ ను సీఎం పదవి ఎక్కించాలన్న ఉద్దేశ్యంతో కమలనాథులున్నారు.

**సనాతన ధర్మం పేరిట...**

పవన్ కల్యాణ్ కూడా నిదానంగా మెట్లను పేర్చుకుపోతున్నారు. పవన్ కల్యాణ్ ఇప్పుడు అందరి మనిషిలా కనిపిస్తున్నారు. ఇటు తెలుగుదేశం పార్టీ క్యాడర్ తో పాటు మిగిలిన సామాజికవర్గాలను కూడా ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. పవన్ కల్యాణ్ ఫ్యూచర్ సీఎంగా అడుగులు వేస్తున్నారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఒకవైపు హిందుత్వాన్ని భుజానకెత్తుకున్నారు. సనాతన ధర్మం పేరుతో పవన్ కల్యాణ్ అటు బీజేపీ మనసును దోచుకోవడమే కాకుండా ఇటు హిందుత్వ నినాదాన్ని అందుకుని తనకంటూ ఒక ప్రత్యేక ఓటు బ్యాంకును ఏర్పాటు చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రి పదవితో సరిపెట్టుకున్నా ఆయన గోల్ మాత్రం ముఖ్యమంత్రి పదవి అనేలా వ్యవహార శైలి కనిపిస్తుంది. తాజాగా భద్రాచలం రామయ్య కల్యాణానికి హాజరు కావడం కూడా అందులో భాగమేనంటున్నారు.

**కమ్మ సామాజికవర్గం కూడా...**

కమ్మ సామాజికవర్గం కూడా చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ ను మాత్రమే ముఖ్యమంత్రిగా కోరుకుంటారు. జగన్ ను ఎట్టిపరిస్థితుల్లో వారు అంగీకరించే పరిస్థితి ఉండదు. ఆర్థికంగా, సామాజికపరంగా, ఎన్ఆర్ఐల నుంచి పారిశ్రామికవేత్తలు, సినీ పెద్దల వరకూ చంద్రబాబు, లోకేశ్ తర్వాత పవన్ కల్యాణ్ కు ముఖ్యమంత్రి పదవి రావాలని కోరుకుంటారు. ఇక ఇటు కాపు సామాజికవర్గం, అటు అభిమానుల బలమైన కోరిక పవన్ సీఎం కావడమే. ఈ నేపథ్యంలోనే పవన్ కల్యాణ్ ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గిరిజనులు, దళితులు, బలహీనవర్గాల ప్రతినిధిగా పవన్ కల్యాణ్ తనను తాను మలచుకుంటూ పోతున్నారు. అయితే సుదీర్ఘ కాలం పాటు వేచి చూసైనా పవన్ కల్యాణ్ తన గోల్ ను చేరే అవకాశాలు మాత్రం లేకపోలేదు.

# హైదరాబాద్‌లో ఈ ఏరియాలో ఉండేటోళ్లు.. ఇప్పట్లో చికెన్ తినొద్దు.. పొరపాటున తిన్నారంటే..






**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా బాట సింగారంలోని పౌల్ట్రీ ఫామ్‌లో బర్డ్ ఫ్లూ సోకడంతో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. ఆ కోళ్లను పరిశీలించిన అధికారులు శాంపిల్స్‌ని భోపాల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హై సెక్యూరిటీ యానిమల్ డిసీజెస(ఎన్ఐహెచ్ఎస్ఏడీ)కు పంపించారు. ఆ కోళ్లకు హెచ్5ఎన్1 వైరస్ సోకిందని సైంటిస్టులు ధ్రువీకరించారు.దీంతో సదరు పౌల్ట్రీ ఫామ్?లోని దాదాపు 10 వేల కోళ్లను చంపేసి జేసీబీ సాయంతో పూడ్చిపెట్టారు. ఆ ఫామ్?ను సీజ్ చేయడంతోపాటు అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో కోళ్లు, గుడ్లు అమ్మకుండా నిషేధం విధించారు. దాదాపు10 కిలోమీటర్ల పరిధిలోని పౌల్ట్రీ ఫారాలను అధికారులు సందర్శించి బర్డ్ ఫ్లూ నివారణ చర్యలు చేపట్టారు. బర్డ్ ఫ్లూ సోకినట్లు నిర్ధారణ అయిన పౌల్ట్రీ ఫామ్?లను అధికారులు గుర్తించి ఫ్లూ సోకిన కోళ్లను చంపి పూడ్చిపెడతారు. షెడ్?ను శానిటైజ్ చేయడంతో పాటు హైపో క్లోరైడ్ తో క్లోరినేషన్ చేసి, మూసివేసి సీజ్ చేస్తారు. కిలోమీటర్? రేడియస్‌లో ఫ్లూ నివారణ చర్యలు చేపడతారు. మూడు నెలల వరకు సదరు ఫామ్?ను క్లోజ్ చేస్తారు.ఆ తరువాత డాక్టర్లు అధికారులు ఫ్లూ లేదని నిర్ధారించిన తరువాతే తిరిగి పౌల్ట్రీని తెరిచేందుకు అనుమతిస్తారు. చనిపోయిన కోళ్లకు ఒక్కో దానికి రూ.130 చొప్పున పరిహారం కూడా అందిస్తారు. ఈ పరిహారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 50 శాతం చొప్పున భరిస్తాయి.

## జిబ్లీ ట్రెండ్ అంత మంచిది కాదు బ్రో.. జాగ్రత్త.. పర్సనల్ ఫొటోలను అదే పనిగా అప్ లోడ్ చేస్తే..



**హైదరాబాద్ పెన్ పవర్:** చాలామంది రకరకాల ఏఐ టూల్స్?ద్వారా జిబ్లీ స్టైల్ యానిమేషన్ ఫొటోలను జనరేట్ చేసుకుంటున్నారు. అందులో ఎక్కువగా వ్యక్తిగత, కుటుంబ ఫొటోలే ఉంటున్నాయి. అయితే.. ఈ వైరల్ ట్రెండ్ ప్రైవసీకి సంబంధించిన ఆందోళనలను పెంచుతోంది. ఇంటర్నెట్ ఎక్స్?పర్ట్స్ ఏఐతో ఫొటోలు షేర్ చేసుకోవడం అంత సేఫ్ కాదని హెచ్చరిస్తున్నారు. డేటా ప్రైవసీ, సెక్యూరిటీ మీద పనిచేసే ప్రోటాన్ ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని షేర్ చేసింది. వ్యక్తిగత ఫొటోలను ఏఐ ప్లాట్‌ఫామ్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత వాటిని ఏఐకి ట్రైనింగ్ ఇవ్వడానికి ఉపయోగిస్తారు.

చాలా ఏఐ మోడల్స్ ఆ ఫొటోలను రకరకాలుగా వాడుకునే అవకాశం ఉంది. కొన్ని సందర్భాల్లో మీ పోలికతో ఉన్న ఫొటోలకు బదులుగా మీ అనుమతి లేకుండా మీ ఫొటోలు ఉపయోగిస్తాయి. అలాంటప్పుడు అవి మిస్‌యూజ్ అవ్వొచ్చు. వాటితో పరువు తీసే విధంగా ఉండే కంటెంట్ క్రియేట్ చేయొచ్చు. ఆ ఫొటోలను డీప్ ఫేక్? లాంటి వాటిలో వాడినా ప్రమాదమే. పైగా ఏఐ టూల్స్‌తో ఫొటోలు, ఆలోచనలను పంచుకోవడం వల్ల మెటాడేటా, లొకేషన్?, సెన్సిటివ్? డేటా బహిర్గతమయ్యే అవకాశం ఉందని ఎక్స్?పర్ట్స్ అంటున్నారు.

## శామీర్ పేట ORR పైన రూ. కోటి విలువైన గంజాయి పట్టివేత

**హైదరాబాద్ పెన్ పవర్:** మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఓఆర్ఆర్ టోల్ ప్లాజా దగ్గర భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయి సరఫరా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి దగ్గరి నుంచి 273 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.దీని విలువ దాదాపు రూ. కోటి వరకు ఉంటుందని అంచనా వేశారు పోలీసులు. బాలానగర్ ఏస్వోటీ, సివిల్ పోలీసులు కలిసి పక్కా సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. బోయిన్ పల్లి లో ప్యాకర్స్ అండ్ మూవర్స్ నడుపుతున్న పంజాబ్ కు చెందిన పర్దీప్ కుమార్ కు సోహెల్ పరిచయం అయ్యాడు. సోహెల్ పై గతంలో ఏన్డీపీఏస్ చట్టం ప్రకారం కేసు నమోదు అయ్యింది ప్రస్తుతం బెయిల్ పై ఉన్నాడు. పర్దీప్ కుమార్ కు సోహెల్ తన వద్ద ఉన్న బోలేరో వాహనంలో గంజాయి తరలించి సొమ్ము చేసుకోవచ్చని ఆశ చూపాడు. వీరు ఇద్దరు ఒడిస్సాలో గంజాయిలో అమ్మకాలు జరిపే సుభి బిశ్వాస్ ను కలిశారు.

ఈ మేరకు పథకం ప్రకారం హర్యానాకు చెందిన డ్రైవర్ సన్నీ, హెల్పర్ మనీష్ కుమార్ కు గంజాయి సరఫరా తీసుకురావాలని సూచించి సుభాష్ కు రూ,1,25 లక్షలు చెల్లించారు. అక్కడి నుంచి వాహనంలోని సామగ్రి మధ్యలో బాక్స్ లో ప్యాకింగ్ చేసుకుని పకడ్బందీగా తీసుకుని వచ్చేలా ఫోన్ లు చేసుకోకుండా వాట్సాప్ ద్వారా సమాచారాన్ని పంచుకుంటూ వస్తున్నారు. ఎస్వోటీ పోలీసులకు ఉన్న పక్కా సమాచారం మేరకు దాడి చేయగా ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల దాడిలో రూ,95 లక్షల విలువ చేసే ఎండు గంజాయి, బోలేరో వాహనం, మొబైల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారీలో ఉన్నారు అని తెలిపారు.

## నీటి వాటాలపై ఏపీతో గట్టిగా తేల్చుకునేందుకు సిద్ధమైన తెలంగాణ

**హైదరాబాద్ పెన్ పవర్:**కృష్ణా జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్‌తో నెలకొన్న వివాదంపై తెలంగాణ ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఏపీ తన వాటాకు మించి నీటిని వాడుకుంటుందనే ఆరోపణల నేపథ్యంలో, కృష్ణా ట్రిబ్యునల్‌లో గట్టిగా వాదనలు వినిపించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది వైద్యనాథన్‌తో భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా చర్చలు జరిపారు. హైదరాబాద్‌లోని జలసౌధలో జరిగిన ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా పాల్గొన్నారు. ఏప్రిల్ 15, 16, 17 తేదీల్లో సుప్రీంకోర్టులో జరగనున్న విచారణలో తెలంగాణ తన వాదనను బలంగా వినిపించేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఉమ్మడి రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా నీటి పంపకాల విషయంలో స్పష్టత రాకపోవడంతో, తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాపై ఏపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలోనే న్యాయపరంగా పోరాడి తమ హక్కులను కాపాడుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది వైద్యనాథన్ తన వాదనలతో ఏపీ వాదనలకు దీటుగా బదులిస్తారని తెలంగాణ ధీమాగా ఉంది.

## ఉత్తరాదిన మండుతున్న ఎండలు.. 21 నగరాల్లో హై టెంపరేచర్

**హైదరాబాద్ పెన్ పవర్:**ఉత్తరాది వేడెక్కుతోంది. అపుడే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ముఖ్యంగా ఢిల్లీ, రాజస్థాన్ ,మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ వీటితో పాటు ఒడిశాలో ఎండలు మండుతున్నాయి. ఈ ఐదు రాష్ట్రాలలోని 21 నగరాల్లో ఏప్రిల్ 6న 42 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ రాబోయే మూడు రోజులు వేడిగాలులతో వీచే అవకాశం ఉంది. ఢిల్లీతో పాటు, రాజస్థాన్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్ ఒడిశాలోని నగరాల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలో ప్రతి నగరంలో మూడు డిగ్రీల నుంచి 6.9 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగాయి. ముఖ్యంగా ఢిల్లీలో గాలి వేగం తగ్గడం వల్ల ఎండలు ఎక్కువయ్యాయి. ఉదయం గాలి వేగం గంటకు 8-10 కి.మీ. ఉండగా.. ఆ తర్వాత క్రమంగా తగ్గుతోంది. మధ్యాహ్నం సమయంలో ఆగ్నేయ దిశ నుంచి గంటకు 4-6 కి.మీ. వేగంతో పెరుగుతుంది. సాయంత్రం, రాత్రి సమయంలో ఆగ్నేయ దిశ నుంచి గంటకు 8 కి.మీ. కంటే తక్కువగా పెరుగుతుంది అని వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. రాజస్థాన్‌లోని బార్మెర్‌లో ఎండలు కొత్త రికార్డులను సృష్టించాయి. ఏప్రిల్ 6న గరిష్ట ఉష్ణోగ్రత 45.6 డిగ్రీల సెల్సియస్ -నమోదయ్యింది. ఏప్రిల్ మొదటి వారంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ఉష్ణోగ్రత ఇది. ఏప్రిల్ 6-నుంచి10 తేదీలలో గుజరాత్‌లోని కొన్ని ప్రాంతాల్లో వేడిగాలులు వీచే అవకాశం ఉంది. ఇదే సమయంలో రాజస్థాన్‌లో కూడా వేడిగాలులు వీచే అవకాశం ఉంది. హిమాచల్ ప్రదేశ్, హర్యానా, చండీగఢ్, పంజాబ్, మధ్యప్రదేశ్ , పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లోని ఏకాంత ప్రాంతాల్లో వేడిగాలుల పరిస్థితి ఎక్కువగా ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

# ఆ దేశం వెరీ డేంజర్... అక్కడికి వెళ్లొద్దంటూ తమ పౌరులకు అమెరికా హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:**అట్లాంటిక్ మహా సముద్రంలోని కొన్ని చిన్న దీవుల సమాహారమే బహామాస్. ఇది కామన్వెల్త్ దేశం. టూరిజం ప్రధాన ఆదాయ వనరు. ఇక్కడి బీచ్ లు, కోరల్ రీఫ్ లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను ఆకర్షిస్తుంటాయి. అయితే, బహామాస్‌కు వెళ్లే అమెరికన్లకు నేరాలు, సొర చేపల దాడుల గురించి ట్రంప్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది. పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి అనుకూలంగా లేకపోతే ప్రయాణాన్ని మానుకోవాలని సూచించింది. బహామాస్‌లో లైంగిక వేధింపులు, హత్యలు పెరిగిపోతున్నాయని అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ముఖ్యంగా న్యూ ప్రావిడెన్స్, గ్రాండ్ బహామా దీవులలోని నసావు, ఫ్రీపోర్ట్ ప్రాంతాలలో నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపింది. ఈ ప్రాంతాల్లోని హోటళ్లు కూడా సురక్షితం కాదని, వ్యక్తిగత భద్రత లేని ప్రదేశాల్లో ఉండకూడదని సూచించింది. సముద్రంలో సొరచేపల దాడులు కూడా



ఎక్కువయ్యాయని, ఈతకు, బోటింగ్‌కు వెళ్లేవారు జాగ్రత్త వహించాలని హెచ్చరించింది.

అయితే, బహామాస్‌కు వెళ్లేటప్పుడు ఎటువంటి ఆయుధాలు తీసుకువెళ్లరాదని, అలా చేస్తే చట్టపరంగా నేరమని అమెరికా ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలు అతిక్రమిస్తే విమానాశ్రయంలో కఠిన చర్యలు తీసుకుంటారని, అరెస్టు చేసి జైలు శిక్ష, జరిమానా విధిస్తారని తెలిపింది. ఈ మేరకు అమెరికా ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది.

# 1996 వరల్డ్ కప్ విన్నింగ్ శ్రీలంక టీమ్ తో ప్రధాని మోదీ ముచ్చట్లు...



**హైదరాబాద్ పెన్ పవర్:**ప్రధాని నరేంద్ర మోదీ శ్రీలంకలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన 1996 వన్డే వరల్డ్ కప్ నెగ్గిన శ్రీలంక క్రికెట్ టీమ్ తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారితో కలిసి కబుర్లు చెప్పుకున్నారు. సనత్ జయసూర్య, రమేశ్ కలువితరణ, అరవింద డిసిల్వా, రోషన్ మహానామా, చామిందా వాస్, కుమార్ ధర్మసేన, హషన్ తిలకరత్నే తదితరులు మోదీతో సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాటి క్రికెట్ జట్టు తరఫున వారు మోదీకి ఓ జ్ఞాపికను బహూకరించారు. దీనికి సంబంధించిన వీడియోను మోదీ సోషల్ మీడియాలో పంచుకున్నారు. 1996 వరల్డ్ కప్ గెలిచిన శ్రీలంక టీమ్ సభ్యులతో సంభాషణ అద్భుతంగా సాగిందని వెల్లడించారు. అంతర్జాతీయ క్రికెట్లో చాలాకాలం పాటు పసికూనగా ఉన్న శ్రీలంక జట్టు 1996లో వరల్డ్ కప్ గెలిచి క్రికెట్ ప్రపంచంలో సంచలనం సృష్టించింది. ఆ వరల్డ్ కప్ కు ముందు ఆస్ట్రేలియాలో పర్యటించిన శ్రీలంక జట్టు... ఓ ఘటన కారణంగా కసితో రగిలిపోయింది. దిగ్గజ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ బౌలింగ్ త్రో అంటూ ఓ అంపైర్ అదేపనిగా నోబాల్స్ ఇస్తుండడంతో అప్పటి కెప్టెన్ అర్జున రణతుంగ తన జట్టును తీసుకుని మైదానాన్ని వీడాడు. ఆ ఘటన శ్రీలంక జట్టు గతిని మార్చివేస్తుందని ఆ క్షణాన ఎవరూ ఊహించి ఉండరు.

ఆ అవమానం వారిలో విజయకాంక్షను రగిల్చింది. జన్మతః శ్రీలంక జాతీయుడై, ఆ తర్వాత కాలంలో ఆస్ట్రేలియా తరఫున క్రికెట్ ఆడిన డేవిడ్ వాట్ మోర్ శ్రీలంక జట్టుకు కోచ్ గా రావడం... ఇండియా, పాకిస్థాన్ లతో కలిసి 1996లో తాను కూడా ఆతిథ్యమిచ్చిన వరల్డ్ కప్ ను శ్రీలంక గెలుచుకోవడం ఓ చరిత్ర. అది కూడా ఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించడంతో శ్రీలంక జట్టుకు ఆ వరల్డ్ కప్ విజయం చిరస్మరణీయంగా నిలిచిపోయింది.